క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని మండల పంచాయతీరాజ్ జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటలకు కొత్త వీరంపాలెంలో రూ. 40 లక్షలతో నిర్మించిన రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను, నాలుగు గంటలకు వెంకటాపురంలో రూ. 67.54 లక్షలతో నిర్మించిన రైతు భరోసా, సచివాలయ భవనాలతో పాటు రూ. 35 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్లను ప్రారంభిస్తారని వివరించారు.

కేంద్ర బృందాన్ని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రంగంపేట: మండలంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర బృందాన్ని గురువారం అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శివరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో నాయకులు కలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా లోపం, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులకు లోటు లేకపోయినా పనులు పూర్తికాకపోవడం తదితర అంశాలపై వినతి పత్రాన్ని అందించామని వారు తెలిపారు. ఈ పనులపై కేంద్రానికి నివేదిక అందిస్తామని బృందం చీఫ్ ఇంజినీర్లు సామిత్ర సేన్ గుప్తా, జీపీ బేగ్‌లు తెలిపారన్నారు. పార్టీ నాయకుడు వెంకటరమణ, రంగంపేట మండల బీజేపీ అధ్యక్షుడు సాయిరాం పాల్గొన్నారు.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సచివాలయ కార్యదర్శులు సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సచివాలయ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందించాలన్నారు. సచివాలయాల వద్ద పథకాల వివరాలు తెలిపే ప్రదర్శన బోర్డులు ప్రదర్శించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాత దూలం నాగేశ్వరరావు సహకారంతో గురువారం 150 మంది నిరు పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. సేవా సమితి సభ్యులు పేదల ఇంటికి వెళ్లి వీటిని పంపిణీ చేశారు.

వ్యక్తికి ఆరు నెలల జైలు

బిక్కవోలు: కాపవరానికి చెందిన ఓ వ్యక్తికి కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2020 ఏప్రిల్ 2న కాపవరంలో 10 లీటర్ల సారాతో దొండపాటి దుర్గారావును అప్పటి ఎస్సై పి.వాసు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అతనికి కోర్టు ఆరు నెలల జైలు శిక్ష లేక రూ.15 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

రంగంపేట: తన భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆకుమర్తి సంధ్యకు గండేపల్లి మండలం యల్లమిల్లికి చెందిన ఆకుమర్తి దుర్గబాబుతో ఐదేళ్ల కిందట వివాహమైంది. భర్త దుర్గబాబు చెడు వ్యసనాలకు అలవాటు పడి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడమే కాకుండా అత్త, మామయ్యలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని సంధ్య ఫిర్యాదు ఇచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ



వెదుళ్లపల్లిలో సంబరాలు

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో చంద్రయాన్–3 విజయోత్సవాన్ని సోషల్ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చంద్రయాన్–3 ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయులు ఎస్.సీతారత్నం ప్రారంభించారు. అనంతరం మోడల్ రాకెట్‌తో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేశారు. పీడీ చింతాలబ్బాయి, ఉపాధ్యాయులు మోహన్, వి.శ్రీనివాస్, భగవాన్, సుధాకర్, కొత్త సూరిబాబు, వానపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరలక్ష్మీ పూజకు వేళాయె..

- నేడు శ్రావణ శుక్రవారం పూజలు
- గ్రామాల్లో పండగ శోభ



అనపర్తి ప్రధాన మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

అనపర్తి: మహిళలు అత్యంత భక్తితో జరుపుకొనే శ్రావణ శుక్రవారం రానే వచ్చింది. రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలను ఆచరించేందుకు అతివలు సిద్ధమయ్యారు. లక్ష్మీదేవి అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రావణ శుక్రవారం నేపథ్యంలో గురువారం అనపర్తి, రూరల్ ప్రాంతాల్లో మార్కెట్లు కళకళలాడాయి. స్థానిక దేవీచౌక్ సెంటర్ నుంచి సంతోషిమాత గుడి వరకూ వివిధ రకాల పండ్లు, పూలు తదితర పూజా సామగ్రితో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద విక్రయాలు జోరుగా సాగాయి. కొనుగోలుదారుల రద్దీతో మెయిన్ రోడ్డులో కొంత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అమ్మవారి పూజకు కావాల్సిన సామగ్రితో పాటు వెండి, బంగారు రూపులు, ఆభరణాలు కొనుగోలు చేసే వారితో జ్యూయలరీ దుకాణాలు కిటకిటలాడాయి. యాపిల్స్, జామ, దానిమ్మ, చెరకు, బత్తాయి, ద్రాక్ష, అరటి పండ్లతో పాటు ముఖ్యంగా తామర పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. శ్రావణ మాసం సందర్భంగా పూల వినియోగం తప్పనిసరి. ప్రస్తుతం పూల ధరలు భారీగా పెరిగాయి. డజను అరటి పండ్లు రూ.100కు విక్రయించారు. ధరలు అమాంతం పెంచడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడ్డారు.

నేడు ఆలయాల్లో పూజలు

వరలక్ష్మీ వ్రతం శుక్రవారం సందర్భంగా అనపర్తి శాంతిపురంలోని గణపతి, సరస్వతి సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా పాతవూరిలో ఉమారామలింగేశ్వర స్వామివారి ఆలయంలో కొలువుదీరిన ఉమాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయనున్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి కృషి



రామేశ్వరం సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించి ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. రామేశ్వరంలో సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చెత్త తొలగింపు పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మికంపోస్టు ఎరువును తయారీ చేసి రైతులకు విక్రయించి ఆదాయం సమకూర్చాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచి ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ విషయంలో ఎక్కడైనా లోపాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అర్హులకు బాధ్యతగా చేర్చాలన్నారు. సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, సచివాలయ కార్యదర్శి అచ్చిరాజు, వీఆర్వో కరెడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు మాంసం స్వాధీనం

అనపర్తి: సామర్లకోట నుంచి రాజమహేంద్రవరానికి వాహనంలో తరలిస్తున్న సుమారు టన్ను పశు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఓ వ్యాన్‌లో మాంసం అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో స్థానిక కెనాల్ రోడ్డులో సిబ్బంది, మధ్యవర్తులతో కలసి తనిఖీలు చేశామన్నారు. దీనిని గమనించిన వ్యాన్ డ్రైవర్ పోలీసు సిబ్బంది నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు. సిబ్బంది సాయంతో వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో పశు మాంసాన్ని గుర్తించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మాంసాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే అజెండా



రామవరంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

అనపర్తి: గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సర్వతోముఖాభివృద్ధే ప్రధాన అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రామవరంలో దేవి గుడి వద్ద నుంచి జమ్మి చెట్టు వరకూ వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు సర్పంచ్ గిరడా గంగాభవానితో కలసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను ప్రగతి బాట పట్టించడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించాలన్నదే సీఎం జగనన్న ఆశయమన్నారు. ప్రభుత్వ సేవలు అందించేందుకు అధునాతన వసతులతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, పాఠశాల భవనాలతో గ్రామ సీమల్లో ప్రగతి పల్లెవిస్తోందని అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో ఈ రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడం వల్ల రైతులకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, వార్డు సభ్యులు నల్లమిల్లి పద్మావతి, చింతా బుల్లెమ్మాయి, కర్రి రామచంద్రారెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల విభజనపై ఆందోళన వద్దు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జి.మామిడాడ, పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు

అనపర్తి: పెదపూడి మండల విభజన విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో పెదపూడి మండలం గొల్లలమామిడాడ, పరిసర గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లల మామిడాడ గ్రామాన్ని మండల కేంద్రంగా ఎంపిక చేయడం వల్ల చుట్టుపక్కల 8 గ్రామాల ప్రజలకు మేలు చేకూరుతుందని, మండల విభజనే జరిగితే జి.మామిడాడను మండల కేంద్రంగా ఎంపిక చేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి గతంలోనే జి.మామిడాడను మండల కేంద్రంగా ఎంపిక చేయాల్సి ఉందని, అయితే తమ పార్టీయే అధికారంలోకి వస్తుందన్న ధీమాతో కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా మండల కేంద్రాన్ని పెదపూడికి తరలించారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్పందిస్తూ ఈ విషయమై ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దీనిపై పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో ప్రత్యేక కమిటీని నియమిస్తున్నామని చెప్పారు. విధాన పరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సి వస్తే అందరి మనోభావాలను గౌరవిస్తూ, కమిటీ సూచనలతో సమష్టి నిర్ణయాన్ని తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ వెంకటరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచులు కురుపూడి మాధవిలతా శ్రీనివాస్, సుందరపల్లి ప్రమీల వీరభద్రం, లంక రమేష్, ఎంపీటీసీలు సత్తి లక్ష్మీసుబ్బారెడ్డి, ద్వారంపూడి పద్మావతి వీర్రెడ్డి, సుందరపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అందరికీ ప్రయోజనం

- ప్రభుత్వ పథకాలపై మరింత ప్రచారం
- క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింత చైతన్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల రెండో విడత సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరత్నాల పథకాలతో కుల, మత, వర్గ, పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరిందన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు గుర్తు చేయడంతో పాటు, రాబోయే ఎన్నికలలో ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలనే విషయాన్ని వివరించాలన్నారు. రాజానగరం నియోజవర్గంలో గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో గతంలో కంటే అధిక మెజార్టీతో మనం విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

20 వేల మందికి నివాస స్థలాలు

నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసి, వాటిలో పక్కా ఇళ్లు కట్టుకునే ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందుతున్నారన్నారు. సుమారు రూ.రెండు వేల కోట్లతో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. వీటితో పాటు తన తండ్రి దివంగత నేత జక్కంపూడి రామ్మోహన రావు ఫౌండేషన్ పేరిట అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలన్నారు.

ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ నిరంతరం ప్రజా సంక్షేమం కోసమే ఆలోచిస్తూ, అనేక పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఇటువంటి నాయకునికి మరోసారి అవకాశం ఇస్తే, పేదల జీవితాలే మారిపోతాయన్నారు. పేదరికం చాలావరకూ తగ్గుతుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, కొండపల్లి దుర్గారావు, దాసి వెంకట్రావు, వేమగిరి కృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వికాస్ ఫార్మసీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినికి బంగారు పతకం అందజేస్తున్న ప్రముఖులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఫార్మసీ అసోసియేషన్ ఆసియా అధ్యక్షుడు రావు వడ్లమూడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించగలుగుతారన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. వీరికి ఎం.ఫార్మసీ విద్యను ఉచితంగా అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ భరత్ వికాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, కాలేజీ చైర్మన్ చినసుబ్బారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా.. బీఫార్మసీ విద్యార్థినులు జవ్వాది సుస్మిత, అమలదాసు మానస, ఫార్మడీ విద్యార్థినులు కొప్పిశెట్టి ఉదయ శ్రీ, సౌజన్య బంగారు పతకాలు అందుకున్నారు.

రాగి తీగల చోరీపై కేసు

రంగంపేట: రాగి తీగల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జి.దొంతమూరులో కర్రి చిన్నారెడ్డికి చెందిన పొలంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దానిలోని రాగి తీగలను చోరీ చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది ధర్నా

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మధ్యాహ్న భోజనం సిబ్బంది ధర్నా చేశారు. అనంతరం మండల రీసోర్స్ సెంటర్‌లో ఎంఐఎస్ సంధ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

లంక భూములు కనుమరుగు!

- గోదావరి వరద కోతతో తీవ్ర నష్టం
- ఆందోళనలో రైతులు, ప్రజలు



బొబ్బిల్లంక వద్ద గోదావరి వరద కోతకు గురవుతున్న లంకభూమి



పురుషోత్తపట్నం వద్ద ఆలయం పరిస్థితి

సీతానగరం: అఖండ గోదావరి వరదతో పంటలు పండించే లంక భూములు కోతకు గురవుతున్నాయి. దీంతో రైతన్నలు కంటతడి పెడుతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటి వారిపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు చెందిన లంకభూములు కోత బారిన పడుతున్నాయి. ప్రతి ఏడాది వచ్చే గోదావరి వరద సమయంలో వందల ఎకరాలకు ఈ సమస్య ఏర్పడుతోంది. ఈ ఏడాది గోదావరి వరద కోతకు సుమారు వంద ఎకరాలు కనుమరుగైంది. లంక భూములే కాకుండా గోదావరి వైపు ఉన్న పలు గ్రామాలు కోతకు గురవుతున్నాయి. ఈ ఐదేళ్లలో సుమారు 600 ఎకరాల లంకభూమిని గోదావరి కోతకు గురిచేసింది. సుమారు 60 ఎకరాల లంక భూముల్లో ఇసుక మేటలు వేసి, పంటలు పండించడానికి అవకాశం లేకుండా చేసింది. పురుషోత్తపట్నం వద్ద కనకదుర్గమ్మ ఆలయం, శివాలయం గోదావరిలో కలిసిపోయాయి. కొన్నేళ్ల అనంతరం ములకల్లంక గ్రామం కూడా కనుమరుగు అయ్యే అవకాశం ఉంది. ప్రతి ఏడాదీ ఈ గ్రామం కోతకు గురవుతోంది. అలాగే బొబ్బిల్లంక వద్ద గోదావరి వైపున కోతకు గురై ఏటిగట్టు వద్దకు గోదావరి పాయ వచ్చే అవకాశం దగ్గరలోనే ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పటికే జాలిమూడి, బొబ్బిల్లంక మధ్య లంకభూమి పోయింది. ఇక్కడ వరద సమయంలో ఇరిగేషన్ శాఖాధికారులు ఇసుక బస్తాలు వేసి, రక్షణ కల్పిస్తున్నారు.

అవగాహన కల్పించాలి



గోదావరి వరదతో పంటలు పండించే లంక భూములు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే ఇలా చాలా నష్టం జరిగింది. లంకభూములు కోతకు గురవ్వకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– కవల దుర్గం, మునికూడలి

కోతతో నష్టం



ములకల్లంక గ్రామం శివారున కోతకు గురైంది. బొబ్బిల్లంక లంకభూమి కూడా ఇలాగే ఉంది. ఏటిగట్టు వద్దకు గోదావరి పాయ వచ్చే అవకాశం ఉంది. ములకల్లంక గ్రామం కొన్నేళ్ల తర్వాత కనుమరుగయ్యే అవకాశం ఉంది.

– గద్దె వీరన్నబాబు, రామచంద్రపురం

కిడ్నీ బాధితుడికి ఎంపీ భరత్‌రామ్ భరోసా

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సీటీఆర్ఐ సుబ్బారావు నగర్ కమ్యూనిటీ హాలు సమీపంలో నివసిస్తున్న కార్పెంటర్, వైఎస్సార్ సీపీ కార్యకర్త 35 ఏళ్ల ఏలూరి రామస్వామి రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు ఎంపీ మార్గాని భరత్ రామ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ వెంటనే రామస్వామి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకుని, కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కిడ్నీ ఇచ్చేందుకు రామస్వామి తల్లి మణి ముందుకు రావడంతో విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయనున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు కావాల్సిన అనుమతులపై ఆర్డీవో, తహసీల్దార్, ఆరోగ్యశ్రీ అధికారులతో ఎంపీ భరత్ స్వయంగా మాట్లాడారు. రామస్వామి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ విషయంలో అధైర్య పడవద్దని, తామందరం అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గైట్‌లో వర్క్‌షాప్

రాజానగరం: శాస్త్రవేత్తలుగా ఎదిగిన వారిలో ఎక్కువ శాతం మంది గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారేనని బెంగళూరులోని రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) విశ్రాంత డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ పి.రాధాకృష్ణ అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో 'మెడ్రన్ రోడర్ సిస్టమ్ అండ్ థైర్ అప్లికేషన్స్' అనే అంశంపై గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన కీలకోపన్యాసం ఇచ్చారు. రాడర్‌కి సంబంధించి అనేక విషయాలను విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ రాడార్లను అభివృద్ధి చేయడంలో భారతదేశం స్వయం సమృద్ధి ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ రాజు, హెచ్ఓడీ డాక్టర్ బి.శ్రీనివాసరాజు, అధ్యాపకురాలు డాక్టర్ ఈ. నిర్మలాదేవి పాల్గొన్నారు.